# కవితా కౌముది

## అంతర్వీక్షణం

అల్లూరి గౌరీ లక్ష్మి

యుగాల నుండీ ఏడేడు జగాల మీదుగా
బహి ప్రాణం కోసం సాగుతున్న అన్వేషణ
నిత్య నూతనం, నిరంతరం
గమనం తెలీని, గమ్యం చేరని
అనవరత ప్రస్థానమిది
అవిశ్రాంత ఆర్తి , అంతం లేని తపన
నీ నా భేదం లేని ఆత్మ బంధువుకై అనంత గవేషణ
నాటి క్షణాల బాసలు నెరవేరునో లేదో..
ఆరాధనా  ప్రవాహం తీరం చేరునో లేదో
ఈ నిరీక్షణా తపస్సు ఫలించునో లేదో..
ఈ ఆలాపన ఆ అమృత మదిని సోకునో లేదో
ఆ జన్మాంతర సాన్నిహిత్యం కొనసాగునో లేదో..
కొండల కోనల గుట్టల మిట్టలు  దాటి
దిగంతాల వైపు అనాదిగా సాగిపోతూ
సుదీర్ఘ ప్రయాణంలో అలిసి పోయి
గుండె చీలి ఆక్రందనైందిలా "ఓ...........య్ "
ఆశ్చర్యం ! అద్భుతం ! అపురూపం ! అపూర్వం !

"ఓ...... హో......య్ "
లోలోపలి లోయల లోంచి
ప్రతిధ్వనించిన స్వరం
దాహార్తి ఆత్మ సేద దీర్చిన సమాధానం
 నా  లోలోపలి అంతరాత్మ ని
మృదువుగా నిమిరిన
సాంత్వన
క్షణ కాల సంక్షిప్త లిప్తల హృదయ తప్త స్పందన
ఇప్పుడొచ్చింది కన్నీరు ఉబికి... ఉబికి...
గుండె లోతుల నుండి పొగిలి... పొగిలి...
మూగవోయిన గొంతు మౌన వీణయ్యింది
మురిసి పోయిన మనసు ఆర్ద్రమై కరిగింది
వానై కురిసింది సముద్రమై పొంగింది
అయింది... ఇప్పుడే జ్ఞానోదయం అయింది !
ఇప్పుడు తెలిసింది ! నన్ను నేనే వెతుక్కుంటు న్నానని!
ఈ అనంతానంతం లో నువ్వు  విశ్వాత్మవని !!
నన్ను లోనికి తీసుకునే  సత్యాత్మవని!!

★★★

# నువ్వో తత్త్వవేత్తవా నేస్తం ?!

నాదెళ్ల అనూరాధ

రాబోయే రహదారుల వెంట నాకోసం ఏదో అద్భుతం
దారి కాచి మరీ వేచి ఉందనే ఆశ
నన్ను ప్రతి మలుపులోనూ ఉత్సాహంగా నడిపిస్తుంటే
సహా పథికురాలివై కలిసిన నిన్ను కాస్సేపు విన్నాను !
ఇవన్నీ ఎప్పుడో విన్నవే నన్న భావం !

మాట్లాడుతూ మాట్లాడుతూ ,
చీకటి గుహల్లోకి మాయమైపోతావ్ !
అంతలోనే అగాధాల్లాంటి సముద్ర లోతుల్లోకి మునకలూ వేస్తావ్ !
కబుర్లకి విశ్లేషణల రెక్కలు తొడిగి ,
సిద్ధాంతాల రూపులు దిద్దుతావ్ !

నీ భాష నాకింకా అలవడలేదు సుమా!
అందుకే కాస్త దూరందూరంగానే తచ్చాడుతున్నానేమో !

అయినా నీ పలకరింపులో చిక్కదనం
నన్నో పరిమళమై అల్లుకుపోయిందన్నది వాస్తవం!!

★★★



# అమ్మ మాట

స్వర్ణ అట్లూరి

సదూకుంటే నీ బతుకు బాగుంటాది
లేకుంటె నా లెక్కన ఇంటిపనికే అంకితం అంటే
సదూకున్నోళ్ళూ సేయాల్న గందా ఇంటి పని
అనుకుండె
తెలీలే అమ్మా...నీ మాట విలువ
తొలి జీతం సేతికొచ్చిందాక ...

కాలేజి రోజుల్లో కొత్త సోకులు నేరుస్తుంటె
'సోకు సొరాకు మొకం బీరాకు' అని సామెతలతో
సిన్నబుచ్చుతా ఉంటె
నీ కళ్ళలో మెరుపు రెప్పవెనుక దాస్తివని
సమజ్ గాలె అమ్మా... అందులో అమ్మతనం
నాకూ ఓ ఆడ బిడ్డ పుట్టిందాక...

ఇంటికొచ్చినోళ్ళని మంచిగా మందలించలేదని
సీవాట్లు పెడుతుంటె వాళ్ళెవరికోసమొ నన్నే
తిడితివని
నాకంటె బంధువులు యెక్కువాయె అని మధన
పడితిని
అర్ధంగాలే అమ్మా...నీ మాటలో లోతు
నేను ఓ ఇంటి కోడలిని అయిందాక...

అత్తవారింట అన్నిటికీ తలొంచి నువ్వుంటె
కడుపు మండుతుండేది నీకెమి తక్కువ అని
అదేమంటే గట్లనే ఉండాల అని పాఠాలు సెప్తుంటే
వళ్ళు మండేటిది అమ్మా...ఓ నాడు నా మామగారు
'మంచిగా సూస్తవ్ బిడ్డా నన్ను నా ఆలిని'
అని సెప్పిందాక...

మళ్ళ జన్మంటూ ఉంటే నీ ఇంటనే పుడతా
నీ సనుగుడే వింటూ నీ బిడ్డగానే పెరుగుతా
తిడితే తిట్టినవ్ కొడితే కొట్టినవ్
దయుంచి నా అమ్మ మళ్ళ నీ కడుపునే కనవా
మరు జన్మలో వీలుంటే జరంత తక్కువ విసిగిస్తా...

★★★



# హైకూలు

## రామకృష్ణ క్రొవ్విడి

కనబడుట లేదు
చంద్రుడు
ఇట్లు – అమావాస్య

★★★

గోడమీద కేలండర్ కు
డాన్స్ నేర్పుతోంది
సీలింగ్ ఫేన్

★★★

అర్థరాత్రి భైరవనాదం
ఒంటరి చీకటికి
ఒకటే భయం

★★★

ఇంద్రధనుసుతో
రంగుల బాణాలేసుకుంటూ..
ఎండ, వాన!

★★★

పువ్వుల ముందు
నవ్వుల పాలయ్యాడు
తేనెతాగే తేటిగాడు

★★★

మంచు దుప్పటిలో
దూరింది
వణుకుతున్న చలి

★★★

సిరానది పుష్కరాలు
కాగితం గట్టున
అక్షరాల స్నానాలు

★★★

కొంగపూలు పూసింది
పొలంగట్టున
తుమ్మచెట్టు

★★★

చీకటి కేన్వాస్ పై
రాతిరి చల్లిన
వెండిరంగు – వెన్నెల

★★★

మబ్బుల పైటేసి
వాన కన్నుగీటింది
మెరుపు సుందరి!

★★★



# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

మాటలాడుట నాతోడ మానవలదు
మరలనీయకు నన్ను నీ మనసునుండి
తరలి నానుండి యెచటికో యరుగబోకు
బ్రదుకనిమ్మొక మూల నీ హృదయమందు

ఎన్నడో నిను నేను వేధించియుందు
ఏవొ సొదలతో నిను విసిగించియుందు
ఈయలేనట్టి ప్రేమనర్థించియుందు
అడిగినది ప్రేమయే, క్షమార్హుడను గానొ!

తిరిగి నను నీవు ప్రేమించు తీరు లేదు
కలసి నాతోడ నడచు భాగ్యమ్ము లేదు
ప్రేమ యెవ్వరికైననర్పింతువేమొ
తలపులోనైన నను నీవు నిలువనిమ్ము

ప్రేమ యనగనేమొ భావించుచుంద్రు
కలసి జీవించుటొక్కటే గమ్యమంద్రు
సతము నీ చెంతయుంట యసాధ్యమైన
నిలిపెద చిరాయువుగ నిన్ను తలపునందు

తలపులవి యెంత కాలమ్ము నిలచునన్న
అంటియుండును జీవమున్నంతవరకు
తీరిపోవక  నిల్చునదృష్టమున్న
యుగయుగమ్ములు మనసుననుందువీవు

COMMENTS